ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)లో భాగంగా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ సూచించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఏవీఎం గ్లోబల్ స్కూల్, ఎన్ఐఆర్డీ, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో బ్యానర్‌ను ప్రదర్శిస్తూ ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.... ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో నూతన ఓటర్ల నమోదు, పేర్లు, చిరునామా మార్పు ఇతరత్రా వాటికి సంబంధిం ఆయా ఫామ్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంజీఐటీలో ప్రవర్తక్ ఏఐ క్లబ్


ప్రవర్తక్ ఏఐ క్లబ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

మణికొండ: విద్యార్థులలో కృత్రిమ మేదస్సు పరిశోధన, అభివృద్ధికి ప్రవర్తక్ ఏఐ క్లబ్ ఎంతగానో ఉపయోగపడుతుందని డీఆర్‌డీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ జేవీఆర్ సాగర్ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో శనివారం ప్రవర్తక్ ఏఐ క్లబ్‌ను ఆయన ఇండియన్ సర్వర్స్ సీఈఓ సాయి సతీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రక్షణ, పరిశోధనలో కృత్రిమ మేదస్సు భవిష్యత్తును వివరించారు. రాబోయే రోజుల్లో అన్ని రంగాలలో విప్లవాత్మకంగా కృత్రిమ మేధస్సు పాత్ర పెరుగుతుందన్నారు. అందులో అదే స్థాయిలో ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డి, ఏఐ క్లబ్ చైర్‌పర్సన్ ఎం.రామాబాయి, ప్రొఫెసర్ ఈశ్వరప్రసాద్,రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న మణికొండ కౌన్సిలర్‌లు


తిరుమలలో ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌తో మణికొండ కౌన్సిలర్‌లు

మణికొండ: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి మణికొండ మున్సిపల్ కౌన్సిలర్‌లు శనివారం దర్శించుకున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ఆధ్వర్యంలో వారంతా శనివారం తిరుమలలో స్వామి వారిని ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. స్వామి వారి ముందు వరకు వరకు వెళ్లి ఎల్–1 దర్శనం చేసుకోవటం మరచిపోలేని అనుభూతిని కలిగించిందని ఈ సందర్భంగా కౌన్సిలర్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



రాజేంద్రనగర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... హైదర్‌గూడ ఉప్పర్‌పల్లి ఈశ్వర్ థియేటర్ సమీపంలో ఈ నెల 5వ తేదీన పెట్రోలింగ్ నిర్వహిస్తున్న రాజేంద్రనగర్ పోలీసులకు 42–45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు సమాచారం అందింది. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలన్నారు.

సమతాస్ఫూర్తి కేంద్రంలో గవర్నర్ దత్తాత్రేయ


గవర్నర్ దత్తాత్రేయకు జ్ఞాపికను అందజేస్తున్న జీయర్‌స్వామి

శంషాబాద్ రూరల్: హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న శ్రీరామనగరంలో శనివారం దత్తాత్రేయ సమతాస్ఫూర్తి కేంద్రాన్ని ఆయన దర్శించుకున్నారు. దివ్యసాకేతాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చినజీయర్ స్వామితో మంగళాశాసనాలు తీసుకున్నారు.

యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం

గోల్కొండ: గుడిమల్కాపూర్ దివంగత కార్పొరేటర్ దేవర కరుణాకర్ అడుగు జాడల్లో నడుస్తూ యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని బీజేవైఎం నాయకుడు దేవర వంశీ అన్నారు. శనివారం గుడిమల్కాపూర్ రాజలింగయ్య కబడ్డీ స్టేడియంలో దేవర కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేవర కరుణాకర్ ప్రోత్సాహంతో నేడు అనేక మంది క్రీడాకారులు వివిధ క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 50 టీమ్‌లు పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు అశ్విన్, సాగర్ తదితరులున్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన

గోల్కొండ: బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన వస్తుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం గుడిమల్కాపూర్‌లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల రాష్ట్ర రైతాంగం ఎన్నో అవస్థలు పడుతుందని ఆయన అన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులకు ప్రధాని నరేంద్రమోదీ అమలు పరుస్తున్న రైతు సానుకూల నిర్ణయాలు ఎంతగానో ఆకర్షిస్తున్నాయని అందువల్లే వారు బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారన్నారు.

ఇంటింటి సర్వేను పటిష్టంగా నిర్వహించాలి

ప్రజలు సహకరించి సమాచారం ఇవ్వాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

శంషాబాద్ ప్రభుత్వ బాలుర పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్


శంషాబాద్ జెడ్‌పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వేను పటిష్టంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శంషాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో వివిధ అంశాలపై మాట్లాడారు. బోధన తీరుతో పాటు మధ్యాహ్న భోజనం ఏ విధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సొంతమవుతాయన్నారు. పాఠశాలలో వండుతున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నాణ్యత లోపించకుండా భోజనం అందజేయాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం ఎన్యూమరేటర్‌లతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే చేయాల్సిన విధానంపై పలు సూచనలు చేశారు. తహసీల్దార్ రవీందర్ దత్ ఇతర అధికారులు పాల్గొన్నారు. –శంషాబాద్


అత్తాపూర్‌లో జరిగిన సర్వేలో పాల్గొన్న రంగారెడ్డి డీఈఓ సుసింధర్‌రావు తదితరులు

సర్వేకు సహకరించాలి...

అత్తాపూర్: కులగణనలో భాగంగా మీ ఇంటికి వస్తున్న, వచ్చిన ఎన్యూమరేటర్లకు సహకరించాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుసీంధర్ రావు అన్నారు. కొంత మంది కుటుంబాల వారు సహకరించకపోవడంతో ఉపాధ్యాయులతో కలిసి స్వయంగా డీఈవో సుసీంధర్‌రావు సర్ది చెప్పడంతో సహకరించారు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం కూడా ఉపాధ్యాయులు కులగణనలో పాల్గొనాల్సిందేనని సమయ పాలన పాటిస్తూ మీ కర్తవ్యాన్ని నెరవేర్చాలన్నారు.

- అత్తాపూర్‌లోని సింపతి విల్లాల కుటుంబ యజమానులు ఈ కుల గణనలతో తమకు ఎలాంటి ఉపయోగం లేదని సహకరించకపోవడంతో ఆ కుటుంబాలకు స్టిక్కరింగ్ వేయకుండానే అధికారులు వెళ్లిపోయారు.
- హైడ్రా పేరుతో ఒక వైపు ఇళ్లు కూలుస్తూ జనాభా లెక్కలు, కుల గణనలతో మా ఇళ్లకు వచ్చి మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ప్రతి ఒక్కరూ కుల గణనలో భాగస్వాములు కావాలని భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలన్న ఈ వివరాలు కచ్చితంగా ఉండి తీరాల్సిందేనని ఈ సందర్భంగా డీఈఓ స్పష్టం చేశారు. నిరసన వ్యక్తం చేస్తున్న కుటుంబాల వారికి ఉపాధ్యాయులు సర్ది చెప్పడంతో వారు సహకరించారు. దీంతో సర్వే కార్యక్రమం సజావుగా ముందుకు సాగింది. ఒక్కో కుటుంబానికి 20 నిమిషాల సమయం పడుతున్నది. కార్యక్రమంలో రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ తదతరులు పాల్గొన్నారు.

నార్సింగిలో...

మణికొండ: ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ప్రతి ఒక్కరూ పూర్తి సమాచారం ఇచ్చి సహకరించాలని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఇంటింటి సర్వేను వారు నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని పలు వార్డులలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఇంటి నుంచి ఎన్యూమరేటర్‌లు తీసుకుంటున్న సమాచారం వివరాల పరిశీలించారు. వైస్ చైర్మన్ విజయ్‌బాబు, కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక, మేనేజర్ యోగేష్, టీపీఓ మణిహారిక, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


నార్సింగిలో చైర్‌పర్సన్, కమిషనర్‌లు

బండ్లగూడ జాగీరు మున్సిపల్ పరిధిలో...

బండ్లగూడ: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే కార్యక్రమంలో భాగంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఎన్యూమరేటర్ల ప్రక్రియను ఆయన శనివారం పరిశీలించారు. 12వ డివిజన్‌లోని ఎన్యూమరేషన్ బ్లాక్ 39ఏ, 40సి, 42–1ఆ లలో పరిశీలించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని తెలిపారు. బాలాజీనగర్‌లో ఎన్యూమరేషన్ ప్రక్రియ బాగానే జరుగుతుందని మున్సిపల్ సిబ్బంది పూర్ణ తెలిపారు. అడిగిన ప్రశ్నలకు సమాధానాలు వివరిస్తున్నారని ప్రజల నుంచి మంచి స్పందల లభిస్తోందని ఆమె తెలిపారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మణికొండ పరిధిలో...

మణికొండ: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)ను మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్, కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్‌లు పలు వార్డులలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్‌లు అడుగుతున్న ప్రశ్నలకు ప్రజల నుంచి వస్తున్న సమాధానాలను గమనించారు. పలు ఆర్థిక విషయాలు, ఆస్తుల వివరాల వరకు వచ్చే సరికి ఎక్కువ మంది చెప్పేందుకు ముందుకు రాకపోవటంతో వారికి నచ్చచెప్పారు. గత ప్రభుత్వం ఇలాంటి సర్వే చేపట్టి అప్పటి వరకు ఉన్న తెల్లరేషన్ కార్డులు, ఫించన్‌లను తొలగించిందని, ఇపుడు ఇలాంటి సర్వే చేపట్టి ఈ ప్రభుత్వం ఏం తొలగిస్తుందని పలువురు ప్రజలు ప్రశ్నించటంతో సిబ్బందికి తలనొప్పిగా మారింది. ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా సిబ్బంది అడిగిన సమాచారం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, ఏఈ సంజయ్, కౌన్సిలర్ నవీన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిలో...


మైలార్‌దేవ్‌పల్లిలో డీసీ రవికుమార్...

మైలార్‌దేవ్‌పల్లి: కుటుంబ సమగ్ర సర్వే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి స్టిక్కరింగ్ ప్రక్రియ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో కొనసాగుతున్నది. ప్రక్రియను జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డీసీ రవికుమార్ శనివారం డివిజన్ పరిధిలోని ప్రేమావతిపేట్, మైలార్‌దేవ్‌పల్లిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... ఇంటి వద్దకే వచ్చే ఎన్యూమరేటర్లు ఇంటికి గోడపై స్టిక్కర్లు అతికిస్తారని... వారికి ప్రజలు సహరించాలని కోరారు. సమగ్ర సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా సిబ్బందికి సహకరించాలన్నారు. ఎన్యూమరేటర్ సుహాసిని, సూపర్‌వైజర్ రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.


బాలాజీనగర్‌లో వివరాలు అడిగి తెలుసుకుంటున్న సిబ్బంది

78,303 ఇళ్లకు సర్వే స్టిక్కర్లు: డీసీ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో 78,303 ఇళ్లకు సమగ్ర కుటుంబ సర్వే స్టిక్కర్లను వేసినట్లు ఉప కమిషనర్ రవికుమార్ తెలిపారు. రాజేంద్రనగర్‌లో శనివారం ఎన్యూమరేటర్లు వేస్తున్న స్టిక్కర్లను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో డీసీ మాట్లాడుతూ... అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం, రాజేంద్రనగర్ డివిజన్లలో స్టిక్కర్ల ఏర్పాటు ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్‌కు 155–175 కుటుంబాలను కేటాయించినట్లు తెలిపారు. వీరంతా మొదటి దశలో స్టిక్కర్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి పూర్తి డేటాను సేకరిస్తారన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులున్నా వాటిని పరిష్కరించేందుకు 50 మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు పూర్తిగా సహకరిస్తున్నారని... సర్కిల్ పరిధిలో ఈ సమగ్ర కుటుంబ సర్వే విజయవంతం అవుతుందన్నారు.


మణికొండలో సర్వేను పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల కూల్చివేత

- అక్రమంగా నిర్మించిన షెడ్లను కూల్చివేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు
- పోలీసు బందోబస్తు నడుమ తొలగింపు


శాస్త్రీపురంలోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని చేపట్టిన నిర్మాణాలపై జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కొరడా ఝులిపించారు. శాస్త్రీపురం డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను కొందరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని చేపట్టిన రేకుల షెడ్లను శనివారం అధికారులు కూల్చివేశారు. సుమారు 208 షెడ్లు, రోడ్లపై నిర్మించిన అరుగులను ఏసీపీ పర్యవేక్షణలో భారీ పోలీసు బందోబస్తు నడుమ తొలగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జీహెచ్ఎంసీ సిబ్బంది జేసీబీ సాయంతో కూల్చివేతలను చేపట్టారు. ఈ సందర్భంగా స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధాన రహదారులపై అక్రమంగా షెడ్ల నిర్మించుకొని వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగేలా చేస్తున్న వారిపై చర్యలు తప్పవని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు.

భవిష్యత్‌లోనూ కూల్చివేతలు



ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకొని నిర్మించుకున్న షెడ్లను తొలగించాము. ఈ కూల్చివేతలు భవిష్యత్‌లోనూ కొనసాగుతాయి. దుకాణదారులు స్వచ్ఛందంగా షెడ్లను తొలగించుకోవాలి. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా షెడ్లను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాము. ప్రజలు నష్టపోకుండా ఉన్న స్థలంలో వ్యాపారం చేసుకోవాలని కోరుతున్నాము. భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి కఠిన చర్యలు తథ్యం.

– శ్రీధర్, అసిస్టెంట్ టౌన్ ప్లానర్



అలరించిన నృత్యార్చన

మాదాపూర్: కళాకారులు కూచిపూడి నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం నృత్యార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళారాధన మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ గురువు తాళ్లపాక సందీప్ కుమార్, తాళ్లపాక శైలజ శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. ఇందులో మీనాక్షి పంచరత్నం, గురుస్తుతి, గురుఅష్టకం, చిదంబర స్తోత్రం, చక్కని తల్లి, అదివో అల్లదివో, లలిత హారతి తదితర అంశాలను కళాకారులు తరంగిణి, యశశ్రీ, శ్రీవల్లి, చైత్ర, రిశిత, గగన, గమ్య, ఆద్యరెడ్డి, ఇషాప్రియల్, శ్రీనిక, దిప్తిశ్రీ, శరణ్య, రూపిత, అక్షయ, సాహితి తదుతరులు పాల్గొని ప్రదర్శించారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు శోభరాజు, మేనేజింగ్ ట్రస్టీ నందకుమార్ కళాకారులను అభినందించి జ్ఞాపికలను అందజేశారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వినతి

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ శ్రీ పోచమ్మ దేవాలయం వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని దేవాలయ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు కమిటీ అధ్యక్షుడు సోమారం రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు శనివారం రాజేంద్రనగర్ జలమండలి జీఎం సాయిలక్ష్మి, డీజీఎం జవహర్ అలీ, మేనేజర్ శ్రావ్యరెడ్డిలను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ... హైదర్‌గూడ శ్రీ పోచమ్మ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్నామన్నారు. గతంలో ఈ దేవాలయం కింద నుంచి డ్రైనేజీ నీరు పారుతూ అమ్మవారి విగ్రహం వద్దకు వచ్చి చేరేవన్నారు. దీని కారణంగా భక్తులకు తీవ్ర అసౌకర్యాలకు గురైయ్యారన్నారు. సమస్యను జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో తాత్కలికంగా సమస్యను పరిష్కరించారన్నారు. దీనిని అధికారులు స్పందించారని కాంట్రాక్టర్‌తో మాట్లాడి డ్రైనేజీ పైప్‌లైన్ పనులను వెంటనే చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. సభ్యులు మద్దూరి బాలసుబ్రహ్మణ్యం, చంద్రయ్య, మద్దూరి బాలమురళీకృష్ణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బస్ స్టాప్‌లలో ఆటోలతో పరేషాన్

బండ్లగూడ: బస్ స్టాప్‌ల వద్ద రోడ్లపై అడ్డగోలుగా ఆటోలను నిలుపుతుండటంతో ప్రయాణికులు, పాదచారులు తీవ్ర అసౌకర్యాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ లోపం కారణంగా ఆటోవాలాలు రెచ్చిపోయి రోడ్లపైనే ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ పరిధిలోని కాళీమందిర్ బస్ స్టాప్ వద్ద అడ్డగోలుగా రోడ్డుపై ఆటోలు నిలుపుతుండటంతో ఆర్టీసీ బస్సులు ఈ ప్రాంతంలో నిలపడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసు అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు

గోల్కొండ: గోల్కొండ కోటలోని మహంకాళీ అమ్మవారికి గోల్కొండ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. విశ్వకర్మ సోదరులకు అన్నింటా శుభం కలగాలని ఈ పూజలు నిర్వహించామని విశ్వకర్మ సంఘం ప్రతినిధులు సాయిబాబాచారి, సురేష్‌చారి తెలిపారు.

సీబీఐటీలో సందడిగా ఫ్రెషర్స్ డే


సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థినులు

మణికొండ: గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలలో ఎంసీఏ ఫ్రెషర్స్ డే ను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫార్చ్యూన్ 500 సంస్థ సాఫ్ట్‌వేర్ డెవలపర్ టి.సందీప్ హాజరయ్యారు. ఆయన రాబోయే విద్యార్థులకు ముందున్న ప్రయాణం గురించి విలువైన అవగాహన కలిగించారు. ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు ఫ్రెషర్స్‌కు స్వాగతం పలికి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కొనసాగిస్తున్న కృషి వివరించారు. స్టూడెంట్స్ అఫైర్స్, ప్రోగ్రెషన్ ప్రొఫెసర్ బి.లింగారెడ్డి సీబీఐటీ ఇటీవల విజయాలను, ఉన్నత విద్య ప్రమాణాలు, సామాజిక, పర్యావరణ విలువలకు సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. తమ సంస్థ ప్రయాణం కేవలం విద్యాపరమైన విజయాల గురించే కాకుండ సమాజానికి సానుకూలంగా దోహదపడే బాధ్యతాయుత పౌరులను సృష్టించటం అన్నారు. సీడీసీ సలహాదారు డాక్టర్ ఎస్ఎల్ఎన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేరీర్ అభివృద్ధిలో తెలివిగా ఉండాలన్నారు. ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ బి. ఇందిర, అధ్యాపకులు డాక్టర్ జీఎస్ఆర్ ప్రసాద్, డాక్టర్ ఎం. రాంచందర్, పి. కృష్ణప్రసాద్, శ్రీనివాస్, పి.రాంబాబులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్ఫటిక లింగానికి అభిషేకం


స్ఫటిక లింగానికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

రాయదుర్గం: కార్తీక మాస అభిషేక కార్యక్రమంలో భాగంగా శనివారం టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కార్తీక మాసం నెలరోజుల పాటు ప్రతియేటా స్ఫటిక లింగానికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు డి.రవీందర్‌రెడ్డి, డి.నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో తూర్పు గోదావరి ఆలమూరుకు చెందిన బ్రహ్మశ్రీ శైవాగమ వాచస్పతి కాళ్లకూరి సూర్యశ్రీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వీవీవీఎస్‌శర్మ, వీ. నాగవికాస్ భక్తుల సమక్షంలో అభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో షిర్డీ సాయి బాబా, గణపతి, దత్తాత్రేయస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు.

15న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు..

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 10 గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకున్న భక్తులు ఆలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని వారు కోరారు.

ప్రతి విద్యార్థికి పర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ తప్పనిసరి

గోల్కొండ: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ తప్పనిసరి అని గోల్కొండ జోన్ డిప్యూటీ ఈఓ కార్యాలయానికి చెందిన రామేశ్వర్ అన్నారు. యూడైస్ ప్లస్, విద్యార్థుల పెన్ నెంబర్ తదితర విషయాలపై శనివారం గోల్కొండ డిప్యూటీ ఐఓఎస్ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వారికి అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత సంవత్సరం నుంచి ప్రతి విద్యార్థికి పర్మనెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు. పాఠశాలలోని విద్యార్థుల వివరాలు, పాఠశాలల వివరాలు పొందుపరిచే యూడైస్ ప్లస్‌లో ఉన్న ప్రతి విద్యార్థికి పెన్ నెంబర్ వస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్, అఖీల్, తిరుపతి, విజయ్‌లతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.